25న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

జెడ్‌పి సిఇఒ వెంకటరామన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 25న జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకట రామన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం పది నుంచి 2,4,1,7 స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 6,3,5వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బేసిక్ పోలీసింగ్‌ను మర్చిపోవద్దు

- పోలీసుల వ్యవహారశైలి మార్చుకోవాలి
- తప్పు చేస్తే క్రమశిక్షణా చర్యలు
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

సమీక్షిస్తున్న రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో, సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుశాఖ ప్రతిష్టను పెంచేలా అంతా క్రమశిక్షణ, సత్రవర్తనతో మెలగాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే నిరుపేదలు, మహిళలు, వృద్ధులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారికి అందుబాటులో ఉండి వారి సమస్యలను శ్రద్ధతో విని చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహార్‌శైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారిపై సానుకూల దృక్పథంలో వ్యవహరించాలన్నారు. పోలీసు వ్యవస్థలో మార్పులు వచ్చినప్పటికీ నేరాల నియంత్రణలో గతంలో అవలంబించిన బేసిక్ పోలీసింగ్‌ను మరిచిపోవద్దని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, గ్రామ సందర్శనలు, పెట్రోలింగ్, రాత్రి, పగలు బీట్లు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో చెడు నడత కలిగిన వ్యక్తులు, గ్రామాల్లోని ప్రధానమైన శాంతిభద్రతల సమస్యలు గురించి విచారణ చేయాలన్నారు. బేసిక్ పోలీసింగు చేయడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని, నేరాలు తగ్గుముఖం పడతాయని అన్నారు. గతంలో నమోదైన నేరాల కంటే ప్రస్తుతం కొత్త తరహాలో సైబర్ నేరాలు నమోదవుతున్నాయని, వీటిని సవాళ్లుగా తీసుకొని పోలీసులు పనితీరు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కొత్త తరహాలో నమోదవుతున్న డ్రగ్స్, సైబరు నేరాలను దర్యాప్తు చేసేందుకు అవసరమైన మెళుకువలను తెలుసుకుని నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. మహిళపై నేరాల విషయంలో కేసుల దర్యాప్తును సకాలంలో పూర్తి చేసి రెండు నెలలు ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. న్యాయ నిపుణుల సలహాలను తీసుకుంటూ, ఐటి చట్టం, స్పెషల్ అండ్ లోకల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజల్లో చైతన్యం నింపేందుకు సోషల్ మీడియాను వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి, వ్యక్తుల మనోభావాలను కించపరుస్తూ, వదంతులు ప్రచారానికి పాల్పడుతున్న వ్యక్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టడంతోపాటు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించే అధికారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని అన్నారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లా నైసర్గిక స్వరూపం, జాతీయ రహదారి, సముద్ర తీరం, పోలీసు స్టేషన్లు, జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరును, శాంతిభద్రతల అంశాలను, వాటి పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను డిఐజికి వివరించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, అమ్మకాలు, వినియోగించే వారిపై జిల్లా పోలీసులు చేపడుతున్న చర్యలను విశదీకరించారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు సరిహద్దు రాష్ట్రం నుంచి జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాలను గుర్తించి, ఆయా మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాలు వినియోగంతో కలిగే అనర్థాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అంతకుముందు విశాఖపట్నం రేంజ్ డిఐజిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి జిల్లాకు వచ్చిన గోపీనాథ్ జట్టీకి ఎస్‌పితో పాటు, పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది రేంజ్ డీఐజీకి గౌరవ వందనాన్ని సమర్పించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద్, బి.రాజశేఖర, ఎ.బి.ప్రసాద్, ఎఐ సిహెచ్.గోపీనాథ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉషాకిరణ్, సీనియర్ ఎపిపి పి.సుశీల, లీగల్ అడ్వైయిజర్ ఎం.యమానిరాణి, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

గోవిందరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాకు వచ్చిన స్మార్ట్ మీటర్లను తక్షణమే వెనుక్కు తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. జిల్లాకు ఆదానీ గ్రూపుకు చెందిన ఆరు వేలు స్మార్ట్ మీటర్లు వచ్చాయని, వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు బిగిస్తున్నారని ప్రస్తావించారు. రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాసగృహలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాసగృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అదాని, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టిందన్నారు. ఈ ఒప్పందాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని అన్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా ఆరోపిస్తూ... మీటర్లను వ్యతిరేకించి హైకోర్టులో పిటీషన్లు కూడా దాఖలు చేశారని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఒప్పందాలను కొనసాగిస్తున్నాయన్నారు. నివాస గృహాలకు మీటర్లతో ప్రీపెయిడ్ పద్ధతి, విద్యుత్ వాడే సమయాన్ని బట్టి అదనపు ఛార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వేయటం తదితర రూపాల్లో భారం పడుతుందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందన్నారు. తక్షణమే ఈ ఒప్పందాలను రద్దు చేసి జిల్లాకు పంపిన మీటర్లను వెన్ను పంపాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉద్యోగులపై ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, ఇతర అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నదే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సామాజిక పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలుకు పెంచిందన్నారు. నగరంలో పేద ప్రజలకు రూ.5కే భోజనం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని అన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరంలో పారిశుధ్యంపై ప్రజలు దృష్టిసారించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, రమణ, భాస్కరరావు, సచివాలయ సిబ్బంది సౌజన్య, కిరణ్, రాము, నరేంద్ర, గంగాధర్, ఈశ్వర్‌కుమార్, ప్రమీల పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'గురజాడ' రచనలు సమాజ శ్రేయస్సుకు దోహదం

మాట్లాడుతున్న జయరాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గురజాడ రచనలు ప్రతి ఒక్కరూ చదవాలని, తద్వారా సమాజ శ్రేయస్సు, అభ్యున్నతికి దోహదపడతాయని, ఆయన సాహిత్యంలో జనాన్ని జాగృతం చేసే గొప్ప అంశాలు దాగి ఉన్నాయని కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. నగరంలోని సన్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు అధ్యక్షతన గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సభలో ఆయన ప్రధానవక్తగా పాల్గొని గురజాడ కథల్లోని కొన్ని అంశాలను వివరించారు. వందేళ్ల పైబడిన ఆయన రచనలు అందులోని పాత్రలు నేటి సమాజంలో కూడా మనకు దర్శనమిస్తున్నాయన్నారు. ఇవి ఆయనకున్న ముందుచూపునకు నిదర్శనమన్నారు. దేశమే ఏర్పడకుండా దేశభక్తి గీతాన్ని గురజాడ రాయడం గొప్ప విషయమన్నారు. దేశమంటే మట్టి కాదు.. మనుషులని చెప్పడంలోనే ఆయన గొప్పతనం అర్థమవుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ గురజాడ రచనలు తక్కువే అయినా అందులోని సారాంశం శతాబ్దాల సమాజ గమనానికి వేగుచుక్కలని ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపల్ పొన్నాన జయరాం మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలను కూడా పెంపొందించుకోవాలని కోరారు మానవత్వం లేని కేవల శాస్త్ర అభివృద్ధి మానవాళికి ఉపయోగపడదని, పెత్తందారులకు అధికారం వెలగబెట్టే వారికి దాసోహం అవుతుందని తెలిపారు. సభాధ్యక్షులు కేతవరపు శ్రీనివాసు మాట్లాడుతూ గురజాడ మూఢ సంప్రదాయాలకు, కులమత విభేదాలకు, మహిళలపై వివక్షతకు ఎదురొడ్డి పోరాడిన మహాయోధుడన్నారు. ఆయన సాహిత్యం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం దేశభక్తి గీతం ఆలపించారు. గురజాడ రచనలపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జె.కెమూర్తి, ఎస్.భవానీప్రసాద్, నెట్టిమి రమణారావు, పి.దివాకర్, పి.సుధాకర్, చింతాడ రామచంద్రరావు, రత్నకిషోర్, మధు, పత్తి సుమతి పాల్గొన్నారు. పి.దివాకర్ వందన సమర్పణ చేశారు.

గత ఐదేళ్లలో రూ.12 లక్షల కోట్ల అప్పు

'ఇది మంచి ప్రభుత్వం'లో మంత్రి అచ్చెన్నాయుడు

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- నందిగాం

గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు అప్పులు చేసిందని, అందులో ప్రజలకు ఇచ్చింది కేవలం 2.50 కోట్లు మాత్రమేనని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వాఖ్యానించారు. మండలంలోని మొండిరావివలసలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన పి.ఉమాపతి అనే రైతు ఎనిమిది బోర్లు వేసి సంవత్సరం మూడు నెలలు కావల్సిన ఎంతవరకు విద్యుత్‌శాఖ అధికారులు కనెక్షన్లు మంజూరు చేయలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంత్రి సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే కనెక్షన్ ఇప్పించాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 22 మంది ఎంపీలను గెలిపించి కేంద్రంలో వినియోగించుకునేలా చేసిన ఘనత రాష్ట్ర ప్రజలకే దక్కుతుందన్నారు. ప్రధానమంత్రి మోడీ సహకారంతో సిఎం చంద్రబాబు వంద రోజుల్లో వ్యవస్థలన్నీ గాడిలో పెట్టారని తెలిపారు. గత ఐదేళ్లల్లో ఒక్క అధికారైనా మీ గ్రామానికి వచ్చారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం టైటిల్ యాక్టు తీసుకొచ్చి ప్రజల భూములన్ని ప్రభుత్వం ప్రయివేట్ వ్యక్తులకు తాకట్టు పెట్టుకునేందుకు వీలుగా చట్టం చేసిందని అన్నారు. ఆ చట్టాన్ని టిడిపి ప్రభుత్వం రద్దు చేసినట్లు గుర్తు చేశారు గత పాలనా కాలంలో ధాన్యము కొనుగోలుకు రూ.1650 కోట్లు రైతులకు బకాయి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వాటిని చెల్లించినట్లు తెలిపారు. డిఎస్‌సి ద్వారా 16,500 ఉద్యోగాలు నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. కొత్త పాలసీ తీసుకొచ్చి ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు చెప్పారు. అక్టోబరు 5 నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చి నాణ్యమైన మద్యం, తక్కువ ధరకు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం కొబ్బరి మొక్కను నాటారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ భరత్ నాయక్, టిడిపి మండల అధ్యక్షులు అజయ్ కుమార్, ఎం.బాలకృష్ణ, కోలాట ఉమాపతి, ఎంపిడిఒ టి.రాజారావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ భాగ్యలక్ష్మి, డిఎల్‌పిఒ ఐ.వి.రమ్, శ్రీకాంత్‌వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు టి.చిరంజీవి, ఎస్.షణ్ముఖరావు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి డైవర్షన్ రాజకీయాలు

మాజీ మంత్రి అప్పలరాజు

మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి- మందస

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడువి డైవర్షన్ రాజకీయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వాఖ్యానించారు. మందసలోని వాసుదేవ ఆలలయాన్ని శనివారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టిటిడి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. దేశ రాజకీయ చరిత్రలో దేవుని చుట్టూ... అనేక రాజకీయాలు చూశారని, కానీ, దేవుని కేంద్ర బిందువుగా చేసుకొని రాజకీయం చేయడం మాత్రం చంద్రబాబు మాత్రమే చెల్లిందని అన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ టిటిడికి భంగం కలిగించే విధంగా మాట్లాడితే... టిటిడి ఇఒ శ్యామలరావు దీనిపై పూర్తి స్థాయి వివరణ ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తమిళనాడుకు చెందిన అగ్రిఫుడ్ సంస్థ టిటిడిపి ప్రసాదానికి వాడే నెయ్యిని సరఫరా చేయడానికి టెండర్ దక్కించుకుందన్నారు. టెండర్ దక్కించుకున్న కంపెనీలు ప్రసాదానికి వాడే నెయ్యిని సరఫరా చేయడం అనేది ఆనవాయితీ అని పేర్కొన్నారు. ప్రసాదానికి వాడే ఏ ముడి సరుకులైనా ఎన్‌ఎబిఎల్ అక్రిడేటెడ్ ల్యాబ్ ధ్రువపత్రం జరిగిన టిటిడికి చేరుకుంటుందని తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

హైకోర్టు జడ్జి సుబ్బారెడ్డి

పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

జిల్లాలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హైకోర్టు జడ్జి ఎస్.సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా పరిపాలనా న్యాయాధికారి, హైకోర్టు న్యాయమూర్తి బార్ అసోసియేషన్‌ను శనివారం సందర్శించారు. ఈ మేరకు న్యాయవాదులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు వృత్తి నైపుణానికి కార్యశాలలు నిర్వహించాలని కోరారు. న్యాయాధికారిని కలిసిన వారిలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిల్లారి ఈశ్వరరావు, కార్యదర్శి, వై.ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షులు, ఎం.అన్నం నాయుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శిస్టు రమేష్, ఎన్ని సూర్యారావు, బిసి న్యాయవాదుల అసోసియేషన్ ఎపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, పి.వి.రమణ దయాల్, వై.మురళీమోహనరావు పాల్గొన్నారు.

అరసవల్లి రోడ్డులోని సన్‌రైజ్ హోటల్‌లో హైకోర్టు జడ్జిలు ఎం.రామకృష్ణారావు, యు.సత్యారావులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జూనైద్ అహ్మద్ మౌలానా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పూల మొక్కలను అందజేశారు.

గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

ఇచ్ఛాపురం: సరిహద్దు ప్రాంతంలో తరుచూ గంజాయి పట్టుడుతుందని, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీ కేంద్రం వద్ద పోలీస్ నిఘా చెక్ పోస్టు చేశామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఒడిశా-ఆంధ్రా సరిహద్దు పురుషోత్తపురం పాత ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద శనివారం సిఎస్‌సి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వాహన తనిఖీ కేంద్రం లేదని, వాహన దారుల ఇబ్బందులను గుర్తించి కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించమని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లే వాహన దారులు ఇక్కడ వాహన పర్మిట్లు పొందవచ్చునని పేర్కొన్నారు. వాహనాల టాక్స్‌నూ చెల్లించవచ్చునని తెలిపారు. వాహనదారులు గతంలో ఈ ప్రగతి సైట్ ఉండేదని, దాని ద్వారా వాహన పర్మిట్లకు, టాక్స్‌లకు ఉపయోగించేవారని అన్నారు. అనివార్య కారణాలు వల్ల ఈ సైట్‌ను నిలిపివేశామన్నారు. ప్రస్తుతం వాహన్ అనే సైట్‌లో వాహనాలకు సంబంధించిన పర్మిట్లకు, టాక్స్‌లకు ఉపయోగించుకొని, తోటి వాహన యజమానులకు ఈ వాహన సైట్ కోసం తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికార్లు ఎవ్వరు కనిపించకపోవడం విశేషం. కామన్ సర్వీస్ సెంటర్ యజమాని నిరంజన్ పాల్గొన్నారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

గృహ నిర్మాణ సంస్థ ఎండి రాజాబాబు

సంతబొమ్మాళి: హుదూద్ ఇళ్లను పరిశీలిస్తున్న రాజాబాబు

శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి: జిల్లాలో నిర్మాణం ప్రారంభించిన ఇళ్లన్నింటినీ మార్చి నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండి పి.రాజాబాబు హౌసింగ్ ఇంజినీర్లను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలను ఒక దశ నుంచి మరో దశకు నిర్ణీత కాలవ్యవధి ప్రకారం పూర్తిచేయాలని స్పష్టంచేశారు. జిల్లాలోని శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు, ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలస జగనన్న ఇల్లు, కోటబొమ్మాలి, సంతబొమ్మాళి మండలంలోని హుదూద్ ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఇంజినీర్లకు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణంలో ఉన్న అవరోధాలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. అలాగే గృహ నిర్మాణ సంస్థ ఇఇలు, డిఇలు, ఎఇలతో ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కొద్దిసేపు బేటీ అయ్యారు. పర్యటనలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు అధికారి బి.నగేష్, ఇఇ నర్సింగరావు, సత్యాజీ, ఎఇ సన్యాసిరావు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి ఎఇ నర్సింగరావు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శిస్తే విజయాలు సొంతం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు: క్రీడాస్ఫూర్తి ప్రదర్శిస్తే విజయాలు మీ సొంతం అవుతాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నియోజవర్గ స్థాయి స్కూల్ అథ్లెటిక్స్, యోగా 14, 17 సంవత్సరాల విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించే పాటలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహ భావంతో మెలిగి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అంతకుముందు జాతీయ పతకాన్ని, గ్రిగ్స్ క్రీడల పతకాన్ని, పాఠశాల పతకాన్ని ఆవిష్కరించారు. నియోజవర్గం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, తవిటయ్య, టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, మాజీ ఎంపిపి గొరకల వసంతరావు, గోవిందపురం, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, అరసవల్లి ఉమామహేశ్వరరావు, గోవింద పాపారావు పాల్గొన్నారు.

కూటమి పాలన శతదినోత్సవ సిత్రం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఒకప్పుడు ఏ సినిమా ఎక్కువ సెంటర్లలో శత దినోత్సవాలు జరుపుకుంటే తమ హిరో అంత గొప్ప వాడనే అనే ట్రెండ్ అగ్ర కథానాయకుల అభిమానుల్లో ఉండేది. కొద్ది వారాల వ్యవధిలో రెండు అగ్రహిరోల సినిమాలు విడుదలైతే ఆ రెండూ వంద రోజులు ఆడేలా పరస్పరం పోటీ పడే వారు. ఒక హిరో సినిమా మంచి ప్రజాదరణ, భారీ కలెక్షన్లతో వంద రోజులు పూర్తి చేసుకుంటే రెండో హిరో సినిమా జనాదరణ లేక 80 రోజులకే థియేటర్ ఖాళీ అయినా? ఏదో విధంగా వంద రోజులు ఆడేలా అభిమానులు తపన పడేవారు. మా హిరో సినిమా కూడా శతదినోత్సం పూర్తి చేసుకుందని గొప్పగా కాలరేగరేసేవారు. ఇప్పుడు రెండో హిరో శతదినోత్సవం పూర్తి చేసుకున్న సినిమా మాదిరిగా ఉంది కూటమి పాలన. కూటమి శతదినోత్సవ చిత్రానికి కథాంశం తక్కువ... ప్రోమోలు ఎక్కువ అన్నట్లుగా ఉంది. ప్రజలకు ఎన్నికల ముందు ఒకటి అరా హామీలు ఇచ్చి మాది మంచి ప్రభుత్వం తనకు తానే గొప్పలకు పోతోంది. వంద రోజుల పాలన సందర్భంగా ప్రభుత్వం 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో వారం రోజుల పాటు ఇంటింటా ప్రచారానికి తెరతీసింది. గతంలో వైసిపిది స్టిక్కర్ల పాలన అని విమర్శించిన కూటమి నేతలు ఇప్పుడు వారూ అదే పని చేస్తూ వైసిపి పాలనను గుర్తుకు తెస్తున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం తామేమే చేశామో, ఒక్కో ఇంటికి ఎంతమేర లబ్ధి చేకూరిందో లెక్కలతో ఒక కరపత్రం రూపొందించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ఒక స్టిక్కర్‌ను అతికించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వమూ సేమ్ టు సేమ్ అదే పని చేస్తోంది. కూటమి ప్రభుత్వం రూపొందించిన పోస్టర్లలో పేర్కొన అంశాలు చూసి ఇవీ హామీలేనా? అని ముక్కున వేలేసుకుంటున్నారు. విజయవాడలో వరదల సమయంలో చంద్రబాబు పది రోజులు పాటు బస్సులో ఉండి నిద్రహారాలు మాని ప్రజలను ఓ తండ్రిలా కాపాడుకున్నారంటూ ప్రచారం చేసుకోవడంపై అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు వరదలు వస్తే తాను పరిష్కరిస్తానని, అవసరమైతే బస్సులోనే నిద్రిస్తానని ఎన్నికల ముందు ఎక్కడా చెప్పలేదే అని వ్యంగ్యస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లింపు అనేది సాధారణ విషయమే అయినా అదేదో దేశంలో తామే ఆ ఘనత సాధించుకున్నట్లు కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు సభల్లో గొప్పలు చెప్పుకుంటున్నారు. కూటమి వంద రోజుల పాలనలో మెగా డిఎస్‌సి ఫైల్‌పై చంద్రబాబు తొలి సంతకం చేశారని ప్రసంగాల్లో ఊదరగొడుతున్నారు. ఉద్యోగం రాకుండా సంతకం చేసిన ఫైల్‌ను చూసి ఎన్నాళ్లు సంతోషపడతామని నిరుద్యోగులు నిట్టూరుస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు చేసింది గోరంత అయితే... కొండంత ప్రచారం చేసుకుంటోంది. పింఛన్లను రూ.వెయ్యి పెంచి, మూడు నెలల బకాయిలను ఇవ్వడం, శ్రీకాకుళం నగరంలో రెండుచోట్ల, టెక్కలి, ఆమదాలవలస ప్రాంతాల్లో చెరొకటి అన్న క్యాంటీన్లను ప్రారంభించి వాటినే గొప్పగా చెప్పుకుంటోంది. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగామంటూ నాయకులు భారీ డైలాగ్‌లు చెప్తున్నారు. రైతులు, మహిళలు వంటి తరగతులకు కనీసం ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉంటే ఏ ఇంటికి వెళ్లినా మాకు ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందని చెప్పుకునే అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ ఒకేసారి అమలు చేసేయాలని ఎవరూ కోరుకోరు. కనీసం రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 సాయం, తల్లికి వందనం పేరుతో మహిళలకు రూ.15 వేలు ఇచ్చి ఉంటే విస్తృతంగా ఉన్న తరగతులకు అవి చేరి వారి నోటి నుంచైనా ఇది మంచి ప్రభుత్వమని మాట వచ్చేది. అటువంటి ఏమీ లేకపోవడంతో ఇది మాటల ప్రభుత్వమే అన్న భావన ప్రజల్లో కలుగుతోంది.

వంద రోజుల్లో చాలా చేశామని పోస్టర్ల ద్వారా చెప్పుకున్న కూటమి ప్రభుత్వం మందుబాబులకు ఇచ్చిన హామీని నెరవేర్చామని చెప్పుకోవడానికి ఎందుకో సంశయించింది. క్వార్టర్ మందును రూ.99లకే అందించేలా నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపినా ఆ విషయాన్ని ఎందుకో చెప్పుకోలేకపోయింది. బహుశా దానిని ప్రచారం చేసుకుంటే బాగుండదని అనుకుందో ఏమో నాయకుల ప్రసంగాల్లో గాని, పోస్టర్లల్లో గాని ఎక్కడా కనిపించడం లేదు. నూతన మద్యపాన పథకాన్ని చాలా వేగంగా అమలు చేయటం వెనుక ప్రభుత్వానికి, కూటమికి ఉభయులకు ప్రయోజనకారిగా ఉండనుందనే చర్చ నడుస్తోంది. నూతన మద్యపాన పథకం కింద రిటైల్ వ్యాపారాన్ని ప్రయివేట్ వ్యక్తులకు లాటరీ పద్ధతిన కేటాయించడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయలు వచ్చి పడతాయి. ఇదే సందర్భంలో కూటమి శ్రేణులకు ముఖ్యంగా టిడిపి నాయకులకు, కార్యకర్తలకు మంచి ఆదాయం తెచ్చి పెట్టనుంది. ఐదేళ్లుగా రూపాయి ఆదాయం లేక కటకటలాడుతున్న నాయకులకు ఆదాయం తెచ్చి పెట్టే మద్యం పథకాన్ని బాబు ప్రారంభించడంతో వారిలో సంతోషం వెల్లివిరిస్తోంది. 2014-19 కాలంలో టిడిపి నాయకులు లాటరీ పద్ధతిన దుకాణాలు దక్కించుకోడం కోసం వారు పడిన తపన చూశాం. దుకాణాలతో పాటు బెల్టు షాపులకు మందును సరఫరా చేసి బాగా కాసులు సంపాదించారు. ఇప్పుడు మళ్లీ అదే విధానం రావడంతో అంతా సంబరపడిపోతున్నారు. అయితే ఇప్పుడు వారితో పాటు కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బిజెపి నాయకులకూ వాటాల కోసం పోటీ పడుతున్నారు. మద్యం ద్వారా ఆదాయం సంపాదించాలనుకోవడం లేదని, అది లేకపోతే గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడిపోతారనే నాణ్యమైన మద్యాన్ని సరమైన ధరలకు ప్రభుత్వం అమ్మాలనుకుంటున్నట్లు ప్రజలను నమ్మబలుకుతోంది. సరసమైన ధరలకు మందు ఇచ్చేందుకు నిర్ణయించిన ప్రభుత్వం పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలనూ తగ్గించి సరసమైన ధరలకు ఇవ్వొచ్చు కదా! అప్పుడు ఈ ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వమని అనుకోరా? నూతన మద్యం విధానం కోసం ఆరు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి విధానాలను పరిశీలించామని చెప్పుకుంటున్న ప్రభుత్వం మరి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్న కర్నాటక, తెలంగాణల్లో ఎందుకు పరిశీలించి అమలు చేయలేదు. పాత రోజుల మాదిరిగా ప్రభుత్వం ఏమి చెప్తే అవి నమ్మేసే పరిస్థితిలో ప్రజలు లేరనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. ప్రభుత్వం తమకు తామే మంచి అనుకునే బదులు అది ప్రజల్లో నుంచి వచ్చేలా చూసుకోవాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధి అమలు చేస్తేనే ప్రజల మన్ననలు పొందగలరు.

హామీలను అమలు చేస్తాం

పొందూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలకు సంతృప్తికర పాలన అందుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం లంకాంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్న ఇది మంచి ప్రభుత్వమని, 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న సిఎం చంద్రబాబు నాయుడు నాలుగోసారి సిఎం బాధ్యతలు స్వీకరించి రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తున్నారన్నారు. మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం లోలుగు గ్రామంలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మన మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.రమేష్ కుమార్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, జనసేన నియోజకవర్గం ఇన్ఛార్జి పేడాడ రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి నాయకులు కూన వెంకట సత్యారావు, అన్నెపు రాము, బలగ శంకర భాస్కరరావు, గాడు నారాయణరావు, బాడాన శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

లావేరు: కూటమి ప్రభుత్వం వంద రోజులు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని అదపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొని ఇంటి ఇంటికి వెళ్లి సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరిస్తూ ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. అనంతరం జెడ్పి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జ్ విశ్వక్సేన్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనువాసరావు, ఎంపిడిఒ సురేష్ కుమార్, ఇఒపిఆర్డి విశ్వేశ్వరరావు, విద్యుత్ ఎఇ అప్పన్న, కిలారి నాగేశ్వరరావు, నడిమింటి చిన్నారావు, ఎఒ సరస్వతి, ఎపిఎం మాధవి లత, పశువైద్యాధికారి లావణ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి గ్రామంలో ఇది మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండ రామారావు, దవళ సింహాచలం, శ్రీనివాసరావు, రామ్మూర్తి నాయుడు, బాబు రావు, సాయికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని వసుంధర, పట్టుపురం పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహించారు. వసుంధరలో తహశీల్దార్ హనుమంతరావు, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, పట్టుపురంలో ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, విఆర్ఒ రమణ, ఎస్.వెంకటరావు, టి.భాస్కరరావు పాల్గొన్నారు.

అలాగే మెళియాపుట్టిలో తహశీల్దార్ హనుమంతరావు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు ఎ.రాజశేఖరరెడ్డి ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనపై పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి వాసు, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, భాస్కరరావు, విఆర్ఒ కోటేశ్వరరావు, కార్యదర్శి చింతల అప్పారావు, యుగంధర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ 22 వ వార్డులో జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి దాసరి దాసరి రాజు ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి కూటమి వంద రోజుల పాలనను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పి.కనకరత్నం, వెల్ఫేర్ సెక్రటరీ పి.ఊర్వశి, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రెటరీ టి.సుమిత్రా, లక్ష్మణ్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

అలాగే టిడిపి వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఊర్వశి, అడ్మిన్ కనకరత్నం, మహిళా పోలీసు సుమిత్ర, ఎఎన్ఎం కుమారి, రామ్మూర్తి ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు.

నౌపడ : నౌపడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి ఆధ్వర్యాన గౌరీశంకర్, బాబ్జి, కర్రి బాలకృష్ణ, కర్రి శంకర్, కార్యదర్శి ఉమాపతి, సచివాలయ సిబ్బంది వెంకట నారాయణ, గవరయ్య, కల్పన, సుగుణ, రంజిత్ ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు.

కోటబొమ్మాళి : మండలంలోని లఖందిడ్డిలో జలవనరుల సంఘం మాజీ డైరెక్టర్ కర్రి అప్పారావు ఆధ్వర్యాన ఎంపిటిసి మాజీ సభ్యులు కర్రి చెల్లయ్య, అధికారులు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు.

శ్రీకాకుళం అర్బన్ : స్టిక్కర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పలాస : మండలంలో నీలావతి, బొద్దపాడు, మాకన్నవల్లి గ్రామాల్లో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, పంచాయతీ విస్తర్ణ అధికారి మెట్ట వైకుంతరావు, కిక్కర ఢిల్లీరావు, కుత్తుం లక్ష్మణ కుమార్, కార్యదర్శి మీనాక్షి పాల్గొన్నారు.

కొత్తూరు : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తూరు, కర్లెమ్మ గ్రామాల్లో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. సర్పంచ్ భగవాన్ దాసునాయుడు, వైస్ ప్రెసిడెంట్ మణికంత, సెక్రటరీ రాము నారాయణ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పాతపట్నం : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మండలంలోని బడ్డుమర్రి పంచాయతీలో బడ్డుమర్రి, ఎస్.జె.పురం, బొమ్మిక గ్రామాల్లో టిడిపి కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు బుద్ధల నరేష్, బెజ్జిపల్లి నీలకంఠరావు, పొట్నూరు గజపతిరావు, సందపు సుదర్శన్, రాంబాబు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

రక్తదానానికి ముందుకు రావాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం ఆర్అండ్‌బి ఇఇ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరం ఏర్పాటు చేసిన ఆర్అండ్‌బి ఎస్ఇ కె.జాన్ సుధాకర్, ఇఇ ఎస్. రవి నాయుడులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్లేటలెట్స్ తగ్గి చాలా మంది రోగులు ఇబ్బంది పడుతున్నారని ఇటువంటి సమయంలో పెద్దఎత్తున రక్తదానం చేసేందుకు ఉద్యోగులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన 70 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటాలన్నారు. ఈ సందర్భంగా ఇఇ కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పెంకి చైతన్య కుమార్, ఆర్అండ్‌బి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న స్వామినాయుడు తదితరులు

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సాహిత్యంతో దిశా నిర్దేశం చేసిన గురజాడ జయంతి రోజున అయన పేరుమీద ఉన్న కళాశాలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు మాట్లాడుతూ మహాకవి గురజాడ జయంతితో పాటు తమ సంస్థల వ్యవస్థాపక శ్రేయోభిలాషి మజ్జి తులసి దాసు వర్ధంతి నిర్వహించడం, విద్యార్థులు వారిని స్మరించుకోవడం సంతోషమన్నారు. అనంతరం శంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం నిధికి రూ.లక్ష చెక్కును స్వామినాయుడు ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో సంచాలకులు సంయుక్త, రంగారావు, డా. పులఖండం శ్రీనివాసరావు, రాజకుమార్, సీతారామ నాయుడు, గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని నీలావతిలో పాడి పశువులకు గర్భకోశ టీకాలు, దూడల వరుగు వందెం పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి సంపదను పెంచాలంటే వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎంతోమంది పాడి పరిశ్రమతో జీవనోపాధి పొందుతున్నారన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై పశువులను పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం 35 దూడలకు పరుగు పందెం నిర్వహించారు. గెలుపొందిన పాడి దూడల యజమానులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ వి.జయరాజ్, శ్రీకాకుళం డిఎల్‌డిఎ సిహెచ్.సత్యప్రకాష్, పశుసంవర్ధకశాఖ ఎడిలు పోతనపల్లి చంద్రశేఖర్. రవికృష్ణ, పశుసంవర్ధకశాఖ అధికారులు మధుబాబు, కుత్తుమ లక్ష్మణకుమార్, కిక్కర ఢిల్లీరావు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న బాలాజీ తదితరులు

సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఈ నెల 14, 15న భీమిలిలో జరిగిన అండర్ 18 యోగా పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు సత్తా చాటిన ఐఐఐటి విద్యార్థులను డైరెక్టర్ ఆచార్య బాలాజీ అభినందించారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీకి చెందిన హేమరితిక 4వ స్థానం, మేఘన 5వ స్థానం, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించారు. జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ కోర్లమోహన్ కృష్ణ చౌదరి, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, వెల్ఫేర్‌డీన్ గేదెల రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిలక్

వంద రోజుల్లో ఏం చేశారు?

టెక్కలి రూరల్: టిడిపి కూటమి ప్రభుత్వం ఈ వంద రోజుల్లో ఏమి చేసిందిని టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ అన్నారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు మోసాలు, అబద్దాలతో సూపర్ 6 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలు ఒక్కటైన అమలు చేసారా? ప్రశ్నించారు. సమావేశంలో ఎంపిపిలు నడుపూరి శ్రీరామ్మూర్తి, అట్లా సరోజినమ్మ, సర్పంచ్‌లు బగాది రామకృష్ణ, హెచ్.వెంకటేశ్వరరావు, సర్లాన బాలకృష్ణ, గుజ్జు మోహన్‌రెడ్డి, పోలాకి మోహనరావు, ఆనందరావు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని లెంకపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రిగ్స్ పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి ప్రతి విద్యార్థిలోనూ ఉండాలని తద్వారా మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు జీవితంలో స్థిరమైన నిర్ణయాలను తీసుకొని ఉన్నత స్థానానికి చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. భవిష్యత్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా తయారు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లెంక శ్యాం, లెంక ప్రభ, అప్పలనాయుడు, కృష్ణ, పిన్నింటి భానోజీనాయుడు, పిసిని జగన్నాధం నాయుడు, ఆదినారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, రమణ, రజనీకుమారి శనివారం తెలిపారు. ఈ నెల 20న తొగరాంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అండర్-17 విభాగంలో వాలీబాల్‌కు కుమార్‌సాయి, పి.తరుణ్, కబడ్డీకి ఆర్.రాజు, కె.సల్మా, బ్యాడ్మింటన్‌కు డి.రాజేష్, సిహెచ్.దినేష్, లాంగ్‌జంప్‌కు డి.రాజేష్, 100 మీటర్ల పరుగు పందెంలో కె.దిలీప్, సిహెచ్.చాందిని యోగ, కె.గుణశేఖర్, అండర్-14 విభాగంలో వాలీబాల్‌లో కె.పృధ్విరాజ్, బ్యాడ్మింటైన్‌కు కె.భరత్, కె.గోవింద, షార్ట్‌పుట్‌లో ఎన్.నాగ హర్షవర్ధన్, కె.గోవింద్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు హెచ్ఎం పి.వెంకటరావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

శ్రీకాకుళం అర్బన్ : నగర పరిధిలో వివిధ పాఠశాలల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గ్రిగ్స్ ఆటల పోటీలు ఈనెల 19, 20 తేదీల్లో పిఎస్ఎన్ఎం హైస్కూల్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ పోటీల్లో బ్యాట్మెంటిన్‌లో ఎ.హేమశ్రీ, ఖోఖోలో ఎల్.రమాదేవి, వి.భార్గవ కృష్ణ, వాలీబాల్ పోటీల్లో టి.లోకేష్ నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎ.దినేష్, ఎ.యోగిలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులతో పాటు ఉత్తమ శిక్షణ అందిస్తున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పైడి భాగ్యలక్ష్మిలను హెచ్ఎం బలివాడ భాస్కరరావు, ఉపాధ్యాయులు సదాశివుని శంకరరావు, చిన్నవాడు, కె.వి.రమణ, రమణ కుమారి, శ్రీపూర్ణిమ, చంద్రకళ, బి.వెంకట లక్ష్మి, గౌరీ, సిహెచ్.విజయశ్రీ అభినందించారు.

టెక్కలి : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ పోటీలకు టెక్కలి మండలం నుంచి బాలుర జట్టుని శనివారం ఎంపిక చేసినట్లు నియోజకవర్గ కన్వీనర్ బాడాన నారాయణరావు తెలిపారు. స్థానిక ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రం ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర జట్టులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపిక పోటీలను మండల విద్యాశాఖాధికారులు దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు ప్రారంభించారు. ఈ ఎంపికల్లో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణరాజా, కె.కె.రామిరెడ్డి, వెంకటరమణ, ఆదిశేషు, అలివేణి, దివ్యవాణి, రీతిసోనా, జగదీష్, రమేష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని పారాపురానికి చెందిన మల్లా బాలామణి (30) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలి పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం బాలేరు పోస్టు ఆఫీసులో అసిస్టెంట్ పోస్టు మాస్టర్‌గా ఉద్యోగం చేస్తుంది, భర్త సుబుద్ది రాధాకృష్ణ టెక్నికల్ ఆపరేటర్ పనిచేస్తున్నారు. భార్యను రోజూ బాలేరు బైక్‌పై దించేశారు. ఇలా వారి జీవితం సాఫీగా సాగుతుంది. ఈ నేపథ్యంలో మృతురాలి పెద్దమ్మ కుమారుడు తిరుమలరావుకు కొన్నాళ్ల క్రితం రూ.15 లక్షలు భార్యాభర్తలు కలిసి అప్పు ఇచ్చారు. గత రెండు నెలల నుంచి తిరుమలరావు ఆచూకీ కనిపించలేదు. దీంతో మానసికంగా ఆందోళన చెందిన బాలామణి ఈ నెల 18న విధులు నుంచి ఇంటికి వస్తూ... మార్గంమధ్యంలో పురుగుల మందు తాగి ఇంటికి చేరుకుంది. కొద్ది సమయానికి అస్వస్థకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఓ ప్రయివేటు ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు జిగ్నేష్‌ఆదిత్య, కుమార్తె షణ్ముఖశ్రీలు ఉన్నారు. మృతురాలి తల్లి అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కింద పడి వ్యక్తి మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి జాతీయ రహదారి డిగ్రీ కాలేజ్ సమీపంలో శనివారం లారీ కింద పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురానికి చెందిన రావివలస మల్లేశ్వరరావు (34) వ్యక్తిగత పనుల నిమిత్తం టెక్కలి వచ్చారు. మల్లేశ్వరరావు టెక్కలిలో ఎక్కువ మోతాదులో మద్యం తాగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ... లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందు కున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృత దేహాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి షర్ట్ జాబిలో ఉన్న ఆధారాల మేరకు వివరాలు సేకరించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'108'లో ప్రసవం

మెళియాపుట్టి : మండలంలోని షంతోష్‌పురానికి చెందిన సవర యశోదకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందజేశారు. సిబ్బంది వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్గంమధ్యలో నొప్పులు ఎక్కువగా రావడంతో 108 సిబ్బంది సత్యం, కెల్లి శ్రీనివాసరావు ప్రథమ చికిత్స నిర్వహించారు. దీంతో ఆమె మగ బిడ్డకు జన్మనదించింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డుకు మరమ్మతులు

కొత్తూరు : ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచన మేరకు మండలంలో నివగాం నుంచి సోమరాజుపురం వరకు అధ్వానంగా రోడ్డును మరమ్మతులు చేపట్టారు. చిన్నపాటి వర్షానికే రోడ్డులోని గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడేవారు. దీనిని ఎమ్మెల్యే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సాయి దుర్గ స్టోన్ కసర్ పార్ట్నర్, మాజీ వైస్ ఎంపిపి అగతముడి మాధవరావు రూ.3 లక్షలు సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

7న జిల్లాస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురంలో అక్టోబరు అక్టోబరు 7 నుంచి 9 వరకు జిల్లాస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యాన జరుగుతాయని పేర్కొన్నారు. ఉచిత ప్రవేశ రుసుంతో పాటు అల్పాహారం, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.15 వేలుతో పాటు షీల్డు ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగి జట్లు రిజిస్ట్రేషన్ కోసం 7382095831. 9704695435, 9618662053 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- నౌపడ

సముద్ర తీరం పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యత అని భావనపాడు మెరైన్ సిఐడి రాము అన్నారు. ప్రపంచ పరిశుభ్రత దినోత్సవ సందర్భంగా భావనపాడు సముద్ర తీరంలో స్థానిక మత్స్యకారులు, యువతతో కలిసి భావనపాడు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సిబ్బంది శనివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విహారయాత్రలకు వచ్చే యాత్రికులు, టూరిస్టులు సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు శ్రీనివాసరావు, మన్మథరావు, ఎఎస్ఐలు జీవకుమార్, చిట్టిబాబు, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

తీర ప్రాంతాన్ని పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి- కొత్తూరు

గత ప్రభుత్వం హయాంలో భూముల రీ సర్వేలో అవకతవకలు జరిగాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు గేదెల కృష్ణారావు, పెదకోట యతిరాజుల మాట్లాడుతూ కర్లెమ్మ రెవెన్యూ భూమిలో సంబంధం లేని వ్యక్తుల పేర్లు రీ సర్వేలో ఎల్‌పి నంబర్లలో జాయింట్ రైతులు పేర్లు నమోదు చేశారని అన్నారు. ఇలా తమ భూమిలో వేరొకరికి ఈ పంట నమోదు చేస్తే ఎలా అని వారు ప్రశ్నించాచరు. కర్లెమ్మకు చెందిన గేదెల కృష్ణారావు, సుధారాణి, చోడవరపు కొండలరావులకు చెందిన భూమిలో ఎల్‌పి నంబరుకి ఉమ్మడి పేర్లు అన్‌లైన్‌లో నమోదు చేయడంతో 1-బి, అడంగల్ పత్రాలు రాడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రీ సర్వేలో కర్లెమ్మ సచివాలయం సర్వేయరు గిరిరాజు అక్రమాలకు పాల్పడి రైతుల భూములు విస్తీర్ణాలు తారుమారు చేశారని ఆరోపించారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురపాక శంకరరావు, పెద్దకోట శివ, మహేష్, రామరాజు, రామారావు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ కమల నాభపురంలో ఉన్న ఎర్ర కొండను కొంతమంది ఆక్రమణ దారులు అక్రమించి మొక్కలు నాటడంతో పాటు పాటు కంకర తీసి వాటిని విక్రయిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు నిమ్మాడలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు తన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సర్వే నంబరు 173లో గల ఎర్ర కొండను కొంతమంది ఆక్రమణ దారులు అక్రమించుకొని కంకరతీసి కొండను నాశనం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని మంత్రికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయన వెంటనే స్పందించి కొండను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానిక రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు.

వినతలను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

చిత్తశుద్ధితో పనిచేయాలి

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బారు నిర్వహించారు. ఎక్కడ పని చేసినా గుర్తింపు తెచ్చుకొనే విధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నుంచి ఆయన వినతులు స్వీకరించారు.

బట్టుపాళెంలో అపారశుధ్యం

- మురుగు నీటిలోనే తాగునీటి కుళాయి
- గతకొన్నేళ్లుగా ఇదే పరిస్థితి
- తరుచూ రోగాల బారిన గ్రామస్తులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి- లావేరు

రోజు పొద్దెన్నె లేచి కడుపు చేతపట్టుకొని రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి రెక్కాడితేగాని డొక్కాడని బడుగుజీవులు వాళ్లు. వారంతా సాయంత్రానికి ఇంటికి వచ్చి కష్టపడి వచ్చి అలసిన ప్రాణాలు సేద తీరేందుకు కూడా నోచుకోని ఆ గ్రామ బడుగుజీవుల బతుకులు. నిత్యం వీధుల్లోను, నివాసాలను అనుకోని నిత్యం మురికి కుపాన్ని తలపించేలా దుర్గంధపు వాసనతో, ఆ మురుగునీటిని అనుకొని ఉన్న తాగునీటి చేతి పంపులు, కుళాయిల నీళ్ళ పట్టి వాటితోనే దాహార్తిని తీర్చుకోవడమే ఆ శ్రమజీవిలకు దిక్కు.

మండలంలోని కొత్తకోట పంచాయతీ బట్టుపాళెంలో గత కొన్నేళ్లుగా నిత్యం విలయతాండవం చేస్తున్న మురుగు నీటిలోనే దుర్గంధపు వాసనతో ఈగలు, దోమలతో గ్రామస్తులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు బయటకు వెళ్లకుండా నివాసాలను అనుకొని ఉండడంతో మురుగు నీటిలోనే వుండే తాగునీరు కుళాయి నీటినే గత్యంతరం లేక గ్రామస్తులు తాగుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో ఎటుచూసినా మురుగు నీరు వెళ్లే కాలువలు లేక విధుల్లోనే మురుగునీరు నిల్వలు పేరుకుపోయి దోమలు, ఈగలతో తరచూ రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల వద్దకు సమస్యను తీసుకు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, గ్రామంలో రెండు చేతిపంపులు పనిచేయడం లేదని, వాటికి మరమ్మతులు చేపట్టలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పంచాయతీకి చెందిన ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, ప్రతినిధి రొక్కం బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం చేయలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొన్నేళ్లుగా ఉన్న మురుగునీరు తొలగించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, కాలువలు నిర్మించి రోగాల భారీ నుంచి విముక్తి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుళాయి వద్ద ప్రవహిస్తున్న మురుగునీరు

మురుగు కాలువలు లేక వీధుల్లోనే మురుగునీరు

మరమ్మతులకు నోచుకోని చేతిబోరు

పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న నాయకులు

పౌష్టికాహారం పంపిణీ

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల వద్ద పోషకాహార మాసోత్సవాల సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. సర్పంచ్ నర్తు వరప్రసాదరావు, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, నర్తు ఢిల్లీరావు, జుత్తు గణేష్, అంగన్వాడీ కార్యకర్తలు జయ, సుందరి, జ్యోతి, విమల, పార్వతి పాల్గొన్నారు.

లడ్డూ వేలం పాట

పొందూరు: మండల కేంద్రంలోని కస్పావీధికి చెందిన వినాయక మండపంలో లడ్డూప్రసాదం వేలం పాటలో మహరాజా మార్కెట్‌కు చెందిన వ్యాపారి ముప్పిడి సంతోష్ రూ.41,600లకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ వేలం పాటలో స్థానిక మెమెంటో కళాకారుడు అరసవల్లి వెంకటరావు రూ.14వేలు చెల్లించి దక్కించుకున్నారు.

మాట్లాడుతున్న సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు

వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

విద్యార్థులు నైతిక విద్యను నేర్చుకొని ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్‌శ్రీ జిల్లా మేనేజర్ వి.వి.అప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సెట్‌శ్రీ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్కార్స్ సేవా సంస్థ అధ్యక్షులు బొంగు సత్యనారాయణ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమానికి హెచ్‌ఎం కె.రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న పరిరక్షణ వేదిక సభ్యులు

సమర్థవంతంగా గ్రామసభలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

అక్టోబరులో నిర్వహించే గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఎంపిడిఒ అధికారులకు విజ్ఞప్తి చేసింది. శనివారం వేదిక సమన్వయ కర్తలు దవళ సింహాచలం, తులగాపు ధనుంజయరావు నేతత్వంలో మండల పరిషత్ ఎఒ జి.వి.ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు 791 ప్రకారం అజెండా ప్రాప్తికి సభలను రూపొందించాలని, సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, సభ నిర్వహణను వీడియో రికార్డింగ్ చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక సభ్యులు బగ్గు అప్పల రాజు, జనపాల సతీష్, వెలమల భార్గవ్, పేడాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- నందిగాం

జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 2న జన్మదినాన్ని పురస్కరించుకొని గొల్లవూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను దుండగులు చింపేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఆధారాలతో సహాయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తాడేల చిరంజీవి, జిల్లా కార్యదర్శి సలాశన షణ్ముఖరావు, జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు పసుపురెడ్డి సోమేష్, రోనంకి విశ్వనాథం, లఖినాన శాంతారావు, బుడ్డ గవరయ్య, పేడాడ త్రివేణి, ఆబోతు వెంకటరమణ, నాగరాజు, మెట్ట నరేష్ పాల్గొన్నారు.

'గురజాడ'కు ఘన నివాళి

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న సుమతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధులు, సంఘసంస్కర్తల స్మృతి వనంలో మహాకవి గురజాడ 162వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గురజాడ అప్పారావు విగ్రహదాతలు డాక్టర్ జామి భీమశంకర్, పత్తి సుమతితో పాటు ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణులు కొంచాడ సోమేశ్వరరావు, సురంగి మోహనరావు, గాంధీ మందిర బృందం గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ వందేళ్ల క్రితమే నేటి సమాజ స్థితిగతులను దిశ, నిర్దేశం చేసే దిశగా గురజాడ రచనలు చేశారన్నారు. పుత్తిడి బొమ్మ పూర్ణమ్మ, కన్యాశుల్కంలో పాత్రల ప్రభావం నేటికీ సమాజంలో ఉందన్నారు. విద్యావేత్త సురంగి మోహనరావు మాట్లాడుతూ దేశంలో ఉన్న కొన్ని అసమానతలపై గురజాడ చేసిన రచనల ప్రభావం ఎప్పటికీ సజీవంగా ఉంటుందన్నారు. ఆధునిక సాహిత్యానికి వెలుగునిచ్చే దిశగా గురజాడ శాశ్వతంగా నిలిచి పోయారన్నారు. ప్రముఖ రచయత్రి పత్తి సుమతి రచించిన 'గురు జాడ పంచాక్షరి పుస్తకాన్ని సోమేశ్వరరావు, బరాటం లక్ష్మణరావు, సురంగి మోహనరావు, పైడి హరనాథరావు, నిష్టల నరసింహమూర్తి ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన గురజాడ జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఆర్.హరిత, అధ్యాపకులు పి.వి.రమణ పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎన్ స్వామి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వామి మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి చేసిన సేవను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ఉషా పద్మిని, అధ్యాపకులు, సాయి కుమార్, అష్టలక్ష్మి, జగన్నాథం, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గురజాడ విద్యాసంస్థల ప్రాంగణంలో గురజాడ జయంతి సందర్భంగా గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది శిష్టు రమేష్, కరస్పాండంట్ ఎ.రంగారావు, డా. పులఖండం శ్రీనివాసరావు, మురళీకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

బూర్జ: అంబేద్కర్ గురుకులంలో గురజాడ జయంతిని నిర్వహించారు. గురుకులం ప్రిన్సిపాల్ బి.దేవేందరరావు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ స్వామి

సంతబొమ్మాళి: స్థానిక శాఖాగ్రంథాలయంలో అప్పారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి స్కూల్ విద్యార్థులు, రీడర్స్ ఉమామహేష్, నారాయణ, సహాయకులు పాల్గొన్నారు.

టెక్కలి : శాఖాగ్రంథాలయంలో గ్రంథాశాధికారి బి.రూపావతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మలు అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమాల్లో కళాశాల ఆధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఎ.రామారావు, లూక్‌పాల్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అప్పారావు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుంపా శ్రీనివాస్, రంకిడి రామారావు, బెందాళం రత్నం, తులసీప్రసాద్, ప్రియదర్శిని, నక్క గోవింధరావు, దుంపల సంధ్యారాణి పాల్గొన్నారు.

'ప్రజలను ముంచే ప్రభుత్వం'

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూటమి ప్రభుత్వం ఊరు వాడ సమావేశాలు పెట్టి మన మంచి ప్రభుత్వం అంటూ చేస్తున్న ప్రచారం అంతా బూటకమని ఇది ప్రజలను ముంచే ప్రభుత్వమని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక సాక్ష్యాత్తు తిరుమల వెంకటేశ్వర స్వామిపై నీచ రాజకీయాలు చేసి, ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు చంద్రబాబు, ఎల్లో మీడియ కలిసి పన్నిన కుట్ర అని అన్నారు. చంద్రబాబు 100 రోజుల పాలన అంతా రాజకీయ కక్ష్య సాదింపు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు, అక్రమాలు, దోపిడీలతోనే సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి ఏమి లేదని మరి ఇది ఎలా మంచి ప్రభుత్వం అవుతుందని, ఇది ముమ్మాటికీ ప్రజలను ముంచే ప్రభుత్వమేనన్నారు. సిఎం చంద్రబాబు తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాష్ట్ర సంపదను అంతా మునిగి పోయే అమరావతిలో పోస్తున్నారని, ఈ విషయం సాక్ష్యాత్తు ప్రపంచ బ్యాంక్ తన నివేదికలో తెలిపిందన్నారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికైనా చంద్రబాబు, ఎల్లో మీడియా దుష్ట ఆలోచనలను గ్రహించాలన్నారు. ప్రజల దష్టి మరల్చేందుకు దేవునితో నీచ రాజకీయాలు చేసి, హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారన్నారు. తిరుమల ప్రసాదం విషయంలో సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరిపించాలని, అప్పుడు నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, రాఘవేంద్రరావు, రామ్మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

రూ.పది వేలు ఆర్థికసాయం

కొత్తూరు : మండల కేంద్రం దేవరవేధికి చెందిన బొమ్మన మోహనరావు కేన్సర్‌తో ఇటీవల మృతి చెందారు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న స్థానికులు లోతుగెడ్డ తాతబాబు సమక్షంలో మృతుడి భార్య బొమ్మన పద్మకు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ లోతుగెడ్డ శంకరరావు, గానుగుల బాబూరావు, లోతుగెడ్డ ఈశ్వరరావు, ఎద్దు నారాయణరావు, కొయిలాపు సంజీవరావు, చల్ల ధర్మారావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పొందూరు : ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్య కిరణ్ అన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని 3వ వార్డు ఊసవానిపేటలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కమ్యూనిటీ హాల్‌లో స్వయం సహాయక సంఘాలతో ప్రతిజ్ఞ చేయించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలు, వీధులు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ హరనాథ్, కౌన్సిలర్లు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), రామారావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం రాపాకలో సర్పంచ్ కొంచాడ వనజ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ చెత్తా చెదారాలను బయట వేయరాదని, ఇంటితో పాటు, వీధుల్లో శుభ్రతను పాటించాని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి శాంతి స్వరూప్, టిడిపి నాయకులు బలగ శంకర భాస్కరరావు, కండాపు శ్రీనివాసరావు, కొంచాడ గొల్లయ్య, సురేష్, రామకృష్ణ, సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లారీలో ట్రై సైకిళ్లను ఎక్కిస్తున్న విఆర్ఎలు

విఆర్ఎలే కళాసీలు

ప్రజాశక్తి- పలాస

పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో పనిచేస్తున్న కొంతమంది శనివారం విఆర్ఎలే కళాసీలుగా మారారు. వారు చేయాల్సిన విధులు కాకుండా కళాసీ పనులు చేయడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఏడాది మే 13న జరిగిన సార్వత్రిక ఎమ్మెల్యే, పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించేందుకు ఎన్నికల కమిషన్ పలాస మండలానికి 42, వజ్రపుకొత్తూరు మండలానికి 41 ట్రై సైకిళ్లు పంపిణీ చేసింది. చాలా నెలల తరువాత కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ సరఫరా చేసిన ట్రై సైకిళ్లు తిరిగి కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని తహశీల్దార్లకు ఆదేశాలు వచ్చాయి. పలాస, వజ్రపుకొత్తూరు మండల పరిషత్ కార్యాలయాల్లోని ట్రై సైకిళ్లు లారీలో ఎక్కించేందుకు కళాసీలు లేకపోయారు. దీంతో విఆర్ఎలే కళాసీలుగా మారి మండుటెండలో ట్రై సైకిళ్లను లారీలో ఎక్కించారు. దీంతో విఆర్ఎలే తమను కళాసీలుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య మెరుగుకు కృషి

పలాస : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కృషి చేయాలని ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని బ్రహ్మణతర్లాలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అందులో భాగంగా కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబరు 2 వరకు ప్రతి గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాదన వుష్పలత, ఎంపిటిసి తుంగాన రవణమ్మ, పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శి లక్ష్మణరేఖ, చాణుక్య పాల్గొన్నారు.

ఫొటోలను తిలకిస్తున్న విద్యార్థులు

'రవీంద్ర భారతి'లో ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమ స్వహస్తాలతో, తమ సునిశిత మేధాశక్తిని ఉపయోగించి కెమెరాల్లో బంధించిన ఫొటోలను పాఠశాల ఆవరణ గ్యాలరీలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డీన్ వి.నాగరాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడంతో స్వంతంత్ర భావన, ఆలోచనాశక్తి పెంపొందించడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ పోటీ గ్యాలరీ తిలకించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తదితరులు పాల్గొన్నారు.

మందులను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం : మండలంలో కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శ్రీకాంత్ మహంతి ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్లు లక్ష్మణ్, ప్రణతి, ప్రకాష్‌లు 225 మందికి బిపి, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే 50 మంది నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయకులు శ్రీదేవి, రేవతి, విజయలక్ష్మి, గాయత్రి, పిఆర్ఒ సంతోష్‌కుమార్, ఏరియా మేనేజర్ లోకేష్, బి.చిన్నారావు, జ్యోతి, పద్మావతి, చంద్రవదన, దేవకి, వాణి, స్వప్నరాణి, ప్రకాష్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి రుణాలు ఇప్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కలివరం గ్రామంలో ఎపిఎం పైడి కూర్మారావు శనివారం సిబ్బందితో క్లస్టర్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజస్ పేరుతో ఎంతమంది మహిళలకు వ్యక్తిగతంగా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించారని అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రుణాలను సకాలంలో మంజూరు చేయించడానికి బ్యాంకు దగ్గర ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. సరైన డాక్యుమెంటేషన్ పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ప్రతి గ్రామ సంఘం నుంచి పదిమందికి వ్యక్తిగత రుణాలు ఇప్పించాలని సిబ్బందిని ఆదేశించారు. స్త్రీనిధి బ్యాంకు ద్వారా మహిళలకు అవసరమైన పెట్టుబడి రుణాలను ఇప్పించాలన్నారు. అన్ని సంఘాల నుంచి మహిళల అవసరం మేరకు పొదుపు నిల్వల నుంచి అప్పులు ఇప్పించి మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమన్వయకర్త రామప్పడుతో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, కలివరం క్లస్టర్ స్థాయి విఒఎలు పాల్గొన్నారు.

సుస్థిర శాంతి అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హర్ష వల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం నగరంలోని ఎన్‌టిఆర్ ఉన్నత పాఠశాల వద్ద ప్రపంచ శాంతి దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు హారికా ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచదేశాల్లో అశాంతి నెలకొని యుద్ధ వాతావరణంతో నాశనమవుతున్నాయని, ఇటువంటి తరుణంలో సమాజ స్థాపన అవసరమన్నారు. క్లబ్ అధ్యక్షులు జగన్నాథం నాయుడు మాట్లాడుతూ ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి అనేక దేశాలు ముందుకొస్తున్నాయని, వినాశనాన్ని కాదని అభివృద్ధిని సాధించడానికి శాంతి అవసరాన్ని గుర్తించారన్నారు. కార్యక్రమంలో కరణం శోభారాణి, హెచ్‌ఎం దేవ దత్త కుమార్, మణిశర్మ, తర్లాడ అప్పలనాయుడు, సుమన్, డాక్టర్ హారికా పాల్గొన్నారు.

వైద్య విద్యను ప్రయివేటీకరించవద్దు

మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ప్రజాశక్తి- టెక్కలి

కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రయివేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతుందని, వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. టెక్కలిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి కొత్తగా 17 మెడికల్ కాలేజీలు మంజూరైతే దానిలో ఐదు మెడికల్ కాలేజీలు 2023లో ప్రారంభమయ్యాయని తెలిపారు. మరో ఐదు కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభం కావలసి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసి) పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరు చేస్తామంటే వసతులు కల్పించలేమని ఎన్ఎంసికి ప్రభుత్వం లేఖ రాయడం సరైన నిర్ణయం కాదన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రానికి రావలసిన 700 మెడికల్ సీట్లు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కేవలం పాడేరు వైద్య కళాశాలకు మాత్రమే 50 సీట్లు మంజూరయ్యాయని అన్నారు. ప్రభుత్వ వైద్య విద్యను మరింత బలోపేతం చేస్తామని, 107, 108 జిఒలను రద్దు చేస్తామని యువగలం పాదయాత్రలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని మెడికల్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈయనతో పాటు జిల్లా నాయకులు ఆర్.మహేష్, ధర్మారావు ఉన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

సోంపేట: మండలంలోని కొర్లం పంచాయతీ అగ్రహారం చెరువు ఆయకట్టు పరిధిలో సుమారు 250 ఎకరాలు సాగుచేస్తున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. మండలంలోని సర్పంచ్ రాంబుడ్డి గణపతి ఆధ్వర్యాన కొర్లాంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పలాసపురం, పాలవలస, కొర్ల పంచాయతీలకు చెందిన రైతులు అగ్రహారం చెరువు ఆయకట్టు పరిధిలో భూములను సాగు చేసుకుంటూ తరతరాలుగా జీవిస్తున్నారని తెలిపారు. సర్వే నంబరు 50 నుంచి 110 వరకు ఉన్న ఈ భూములు వంశపారంపర్యంగా అనుభవిస్తున్న తమకు ఇటీవల ఒరిశా రాష్ట్రం గంజాం జిల్లా పాత్ర పురం పంచాయతీ జయంతిపురానికి చెందిన భువనేశ్వర పాడి కుమారుడు కష్ణచంద్ర పాడి నుంచి ఫిర్యాదు వచ్చిందన్నారు. ఈ భూములలను తమకు ఈనాంగా వచ్చాయని, రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ల్యాండ్ రీ సర్వే సమయంలో ఈ భూములన్ని తన పేరుపై నమోదు జరిగినట్లు అతడు తెలిపినట్లు చెప్పారు. గతంలో ఈ భూముల క్రయవిక్రయాలు వారసత్వ మార్పులు అన్నింటిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అవకాశం జరిగిందని, కానీ, ఇప్పుడు సోంపేట సబ్ రిజిస్టార్‌లో ఈ సర్వే నంబర్లకు లాక్ చేశారని అన్నారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ గణపతి

పలుచోట్ల అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని అబ్దుల్ కలాం నగర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జై భీమ్ ఆటోడ్రైవర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాయితీ చంద్రశేఖర్ (గబ్బర్), రాయితీ శ్రీనివాస్, సునీత దంపతుల ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ వెనుక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొర్ను ప్రతాప్, మైలపల్లి నరసింహమూర్తి, మైలపల్లి మహాలక్ష్మి, గనగళ్ళ మూర్తి, పైల చంద్రశేఖర్, తిత్తి నరసింగరావు, కొమర రామారావు, పుక్కల లక్ష్మణరావు, అరసవిల్లి లక్ష్మణరావు, రుప్ప రమేష్, కటాపటి రవి, దుమ్ము అప్పన్న, సూరాడ ధనరాజు, బర్రి మురళి, పల్లి శ్రీను, పొంగ స్వామి, దుమ్ము రాము, రొక్కం తనూజ్, గోపి, బచ్చు జయమ్మ, ఎస్ నాగు తదితరులు పాల్గొన్నారు. డిసిసిబి కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బాల గణపతి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బిర్లంగి రామమోహనరావు, డాక్టర్ గెడ్డవలస సురేష్, బొడ్డు బిందు కృష్ణ, ప్రసన్న కుమార్ దేవ్, కూన శ్రీనివాస్, పైడినాగేశ్వరావు, ఎలక్ట్రికల్ ఎఇ సురేష్, మామిడి ధర్మారావు, గొప్పు సంతోష్, చామర్తి గోపాలా చార్యులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో భారీ వర్షం

గుంతలో బోల్తాపడిన ఆటో

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రంలో కురిసిన భారీ వర్షానికి రహదారులు నీట మునిగాయి. శనివారం కురిసిన వర్షానికి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న నందికొండ కాలనీలో రహదారులన్నీ సాగునీటి కాలువలను తలపించే విధంగా తయారయ్యాయి. అలాగే సరుబుజ్జిలి నాలుగు రోడ్ల కూడలిలో రహదారులు జలమయంగా మారాయి. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ నుంచి బొర్రంపేట వరకు అలికాం, బత్తిలి ప్రధాన రహదారిలో ఉన్న గుంతలన్ని నీటితో నిండి పోవడంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జలమయంగా ఉన్న గుంతలను కొంతమంది కొత్త వాహనదారులు అకస్మాత్తుగా గుంతల్లో దిగి పడిపోవడం వంటి సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. శ్రీకాకుళం నుంచి హిర మండలం వైపు వెళ్తున్న ఓ ఆటో పెట్రోల్ బంకు వద్ద ఎబి రహదారిపై ఉన్న గుంతను తప్పించ బోయి అదే గుంతలో బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు భారీ గుంతలు ఉన్న పెట్రోల్ బంక్ ప్రాంతానికి చేరుకొని వాహనాలను విడతల వారీగా రాకపోకలకు అనుమతించారు.

గుంతలో బోల్తా పడ్డ ఆటో

రహదారిపై చేరిన వర్షపు నీరు

అంతిమయాత్రకు దారేది?

- దశాబ్దాలుగా తప్పని అవస్థలు
- పొలంగట్లే ప్రధాన రహదారి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కొల్లివలస గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న చీడివలసలో శ్మశానవాటికకు సరైన రహదారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తులు ఎవరైనా మరణిస్తే శ్మశానానికి వెళ్లేందుకు రహదారి లేక పొలాల మధ్యలో పాడే మూసుకుంటూ మోకాళ్ల లోతు బురదలో శ్మశానానికి చేరుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమయంలో గ్రామస్తుల అవస్థలు వర్ణణాతీతం. శ్మశానానికి రహదారి నిర్మించాలని పాలకులకు, అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం శూన్యమని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొలంగట్లపై నుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు